# రంగస్థలి

ఉద్యోగ విరమణ చేసి పట్నంలో ఎదిగిపోయిన చెట్టులా ఉన్న ఏడంతస్తుల భవనంలో, పై భాగంలో ఉన్న, ఈ చెట్టు వేళ్ళు నేను పుట్టి పెరిగిన పల్లెలోని మట్టిలోనే ఉన్నాయ్. ఇప్పుడు ఆ పల్లెలో మాదీ అన్నది ఒక ఇల్లు, మావాళ్ళూ అని చెప్పుకోడానికి ఒక దూరపు బంధువు ఉన్నారు. ఆ బంధువు ఇంట్లో ఒక శుభకార్యం జరుగుతూందంటే ఇదే అదననుకుని ఒంటరిగా బయలుదేరాను. ఈ ఊరు రావడం ఆరేళ్ళ తరువాత. ఏదైనా మారడానికి కాలం ఒక్కటే కాదు, కాలంలో జరిగిన సంఘటనలు ప్రధాన పాత్ర వహిస్తాయని నేను పుట్టి పెరిగిన ఇంటిని చూడగానే తట్టింది. ఏటి ఒడ్డున ఉన్న మా ఇల్లు ఈ ఆరేళ్ళలో రెండు గాలివానలను ఎదుర్కొని శిథిలమైపోయింది. నేను ఏ బండరాయి మీద నిల్చొని స్నానం చేసేవాడినో, దానిమీదే ఒంటరిగా కూర్చుని ఎదురుగా ఉన్న మా ఇంటివేపు చూస్తున్నాను. ఎవరి చేతికి చిక్కిన కలపను వాళ్ళు తీసుకుపోయారు. కూలిన గోడలు కుయ్యో మొర్రో అని విలపిస్తున్నట్లున్నయ్. ఏడాదికి ఆ మిద్దె ఇంటి మీద గడ్డితో చొప్పనేత నెయ్యించడానికి ఖర్చు వందల నించి వేలకు పెరగ్గానే ఎవరిక్కడుంటారని అశ్రద్ధ చెయ్యడం వలన పర్యవసానం ఇది. నా అశ్రద్ధతో నేను ముత్తాత నిర్మించిన మహల్ ని కూల్చేశానని, ఇప్పుడు నేను చేసేదేమీ లేదని, గతాన్ని తలుచుకుని కన్నీరు తుడుచుకోవడమేనని తోచింది.

ఈ ఇల్లు తూర్పు, పడమరలుగా మూడు గదుల ఇల్లు. ఉత్తర, దక్షిణాల్లో పెద్ద వరండాలు. పడమటి గదిలో మా ముత్తాత ఉండేవారట. మధ్య గదిలో మా తాత, తూర్పు గదిలో మా నాన్న ఉండేవారు. మూడు తరాలే ఈ ఇంట్లో మసలుతారని పసిగట్టాడో ఏమో నాలుగో గది వెయ్యలేదు. ఈ మూడు గదుల్లో మసలిన నా పూర్వీకులు, నటించిన మూడు విభిన్న నాటకాల్లో కథానాయకుల్లా ఉండేవారు. వాళ్ళు నటించిన ఈ రంగస్థలం ఇప్పుడు శిథిలమైపోయింది. కానీ, ఆ పాత్రల నటనను తిలకించినవారిలో లేక ఆ నటనా కౌశల్యాన్ని చెప్పగా విన్నవాళ్ళలో నేనొకడిని. ఆ పశ్చిమ గదిలో కొన్నాళ్ళు నేనున్నాను. వీధి బడిలో చదివిన పాఠాలు ఆ గదిలోనే హరికెన్ లాంతరు వెలుగులో వల్లించుకునేవాడిని. సుమతి, వేమన శతకాలు, కృష్ణ శతకంతో మొదలిడి పోతన భాగవతంలో పద్యాలు గొంతెత్తి కమ్మగా పాడుకునేవాడిని. ఆ రాగం విన్న మా తాతయ్య "ఆ గదిలోనే కళలు పుట్టాయిరా – నువ్వే కళ పట్టే అది రాణిస్తుం"దనేవాడు. మా

ముత్తాతను నేను చూడలేదు. మా నాన్న చూశారు. గోపయ్య గానలహరితో గోవులే తలలాడించేవట. మనిషి నల్లనివాడు కాడు. తెల్లనివాడు. నల్లని బొద్దు మీసాలున్ననాడే నేతిని తాగాడు, పట్టుతేనె జుర్రాడు, చిక్కటి పాయసం అతనే కాదు ఆ మీసాలు కూడా అరగించేవట. ఈ ఇంటిని దళసరి బంకమట్టి గోడలతో కట్టినా, ఇంటి కలప బర్మా నుంచి వచ్చిన టేకు. సరంబీ అంతా చిలుకులు చెక్కుళ్ళతో మెరిసిపోయేది. స్తంభాలన్నీ కలపవే. భారతీయ శిల్పులు చూపిన ప్రజ్ఞావైభవం ఈ చుట్టుపట్ల ఉన్న వడ్రంగి కళాకారులు ఈ ఇంటిలో చూపించారు. ఇంటి సొగసును చూడడానికి చుట్టుపట్ల గ్రామాల నుంచి వచ్చి చూసేవారట. ఎవరూ చెయ్యని పని చేసి సాహసవంతుడని పొగడ్తలందుకోవడం అతనికి ఇష్టమట. ఎదుటివాళ్ళకు సహాయపడడంలో కాక, తన బాగు తాను చూసుకోవడంలో దిట్ట. ఆ రోజుల్లో గొప్పవాడనిపించుకోడానికి మగసిరితో తొడలు చరిస్తేనే రాజులతో సమానం అన్నమాట. అలాంటి పేరు రావాలంటే ఎవ్వరూ వంచలేని సివంగిని వంచితేనే ఇతన్ని సింహం అని శభాష్ అంటారు. ఆ సివంగి ఎవరినీ దరిచేరనిచ్చేది కాదట. పెద్ద అందకత్తె కాదట. కానీ, అవిడ నడిస్తే భూమి దద్దరిల్లేదట. మాటాడితే మగాడు ఒక సుడిగాలిలో చిక్కుకున్నట్లేనట. ఆ కారునలుపు కండల మనిషి కళ్ళెప్పుడూ ఎర్రగా మెరుస్తుండేవట. మా ముత్తాత వంచేసి, దాసోహం అనిపించి ఆమెను తనదాన్ని చేసుకున్నాడట. మనిషి ముసలైనా మనసు ముసలిది కాలేదట. అరవై ఏళ్ళలో ఇరవై ఏళ్ళవానిగా మసలాడట. ఆ తరం ప్రజ అంతగా అసహ్యించుకున్న ఆ సివంగి బంటెమ్మ గురించి ఇప్పటికీ ఊర్లో చెప్పుకుంటారు. దానికి ఒక కారణం ఉందట. ఆ కారణం ఏమిటా అని ఆలోచనలో పడినప్పుడు నన్ను వెతుక్కుంటూ ఒకావిడ వచ్చింది. మొదట పోల్చుకోలేకపోయాను. ఒకసారి నా మూతిని చేత్తో తాకి, ఆ చేతిని ముద్దు పెట్టుకుంది. వయసులో మిగిలిపోయిన ఆమె కోరికను ఈ ముసలి కాలంలో తీర్చుకున్నంత తృప్తితో మాటలు మొదలు పెట్టింది.

"నివ్వు వచ్చినావని తెలిసి సీతారాం బాబింటికెళ్తే నివ్విక్కడున్నావని తెలిసింది. ఎన్నాళ్ళకు నివ్వు పుట్టినూరుకు పారొచ్చినావు బాబూ! దేశం తిరిగి మా ఊరి మర్యాదుంచినావు. మారాజు తండ్రివి. నీకు తెలియని ఊరా? నివ్వు ఎరగని మనుసులా? మారాజులున్న ఈ ఇంటిలో మెసిలినావు. ఏనాడూ ఇది ఇలాగ కూలిపోతాదని అనుకున్నావా? అంతా బగవంతుడి రాత. మన సేతిలో ఏమీ లేదు. నన్ను వయసులో సూసినావు కదా! ఎలా ఉండేదాన్ని? కట్టుకున్న మొగుడు సత్తవా లేనోడు. ఎందరి సత్తా ఉన్నోళ్ళని పట్టుకున్నా ఎవ్వడూ ఒక బిడ్డనియ్యలేదు. నేను పాపిష్టిదాన్నట!"

"ఎవరన్నారు?" అడిగాను.

"సంపదున్నా సాయం సెయ్యని సత్తెయ్యమ్మ ఉన్నాది కదా! ఉండా పండు తిని నాయంత వయసు పోసుకున్నా నిగనిగ ఇంకా మెరిసిపోతన్నాది. ఆకలితో సగం, విచారంతో సగం సస్తున్న నాలాంటోలికి మొండిసెయ్యే సూపిస్తాది బాబూ. ఇక్కడ అంతా మనదీ అనుకుని బతుకుతాం, అక్కడ మనది ఏదీ కాదని ఎప్పుడు తెలుసుకుంటాం?"

"అలాగ తెలుసుకోడానికి నివ్వేం చేస్తున్నావు" అని అడిగాను.

"ఊరిలో మెప్పులేనిదాన్ని అత్తింటికెళ్తానా? పుట్టింటికెళ్తానా? కూటికి బతికున్నాను. కాటికి పోవాలంటే సావాల. బలవంతంగా సస్తే కనపడకపోయినా గంగమ్మ దెయ్యమై పీడిస్తుందంటారు. మరీ తిట్టారు."

"ఆ తిట్లు తప్పించుకోడానికి ఏం చేశావు?"

"మనసు బాగులేక ఒకనాడు ఏటొడ్డు తుప్ప సాటున కూకున్నాను. అప్పుడే పొద్దు కుంగిపోనాది. కళ్ళు మసకలు కమ్మేసినాయి. ఒకనాడు మల్లెపువ్వని అంతమంది వాసన సూసినారే! నిత్యమల్లినైతే ఆ కృష్ణపరమాత్మ పాదాల మీద పడేదాన్నే. నా దేముడా – నా తెలివితక్కువకు లెంపలేసుకుంటున్నాను. దిక్కులేనోల్లకి నివ్వే దిక్కు, నన్ను కాపాడమని వేడుకున్నాను. అకాశం మీద ఒక చక్రం తిరిగింది. కిష్ణభగవానుడు చక్రం అడ్డెట్టాడు. లోకానికి నీ అవసరం లేకపోతే, నీకు నా అవసరం ఉందన్నాడు. నా నోటి వాక్కు కిష్ణభగవానుడి వాక్కు. కలకాలం సుకంగా ఉండు బాబూ" అని దీవించినట్లు కుడిచేతిని నా తలపై పెట్టిందీ భక్తురాలు.

"ఇంద" అని కొంత డబ్బు ఆమె చేత పెట్టాను.

"ఇంతేల బాబూ?" అంది.

"నీ కృష్ణభగవానునికి పూజచేసి, ఆ ఫలహారం ఒక నెలరోజులపాటు తిను" అన్నాను. ఆ నోట్లు కళ్ళకు హత్తుకుని, ఒకసారి మా ముత్తాత గది దగ్గరకు వెళ్ళి తేరి చూసింది. ఆ చింకి చీరతో వంగి నడచిపోతున్న ఎముకలపోగు గంగమ్మను చూస్తున్నాను. నా కంటికి యౌవనంలో ఊగుతూ, వాలుతూ ఒయ్యారం ఒలకబోసే గంగమ్మ కళ్ళకు కట్తోంది. అలా చూస్తుండగా మా ముత్తాత ప్రేయసి బంటెమ్మ వయసులో ఇలాగే ఉండేదేమో అన్న ఊహ రాగానే ఒకనాటి దృశ్యం నా కళ్ళకు కట్టింది. నాలుగు పదులు దాటినా, ఆ దృశ్యం నిన్ననే జరిగినట్లు నిత్య యౌవనిలా వెంటాడుతూనే ఉంది. అనాటి దృశ్యం – అమావాస్య రాత్రి ఆకాశం నిండా చుక్కలు. నా నూత్న యౌవనంలో ఇద్దరం భేటీ పడ్డాం. అదీ ఒక బాగా అల్లిన బీరపాదు చాటున వంట ఇంటి నుంచి వస్తున్న పుల్లల వెలుగులో గంగమ్మ పయ్యెద వాల్చగా పయనించిన అందం నన్ను వెల్లువలా ముంచివేసింది. వణికిపోయి వెనుతిరిగి పోయాను.

ఈ దృశ్యం ఏనాడో జరిగింది. ఈనాటికీ నాకు గుర్తుకు వస్తుంటుంది. నేనూ ఆ రాత్రి పదుగురిలా మల్లెపువ్వును నలిపినట్లు నలిపేసి ఉంటే, ఆ ఉద్రేకం పోయాక బహుశా ఆమె గురించి మరచిపోయేవాడినేమో? ఇలా ఒంటరిగా తారసపడి మూగభాషతో అందిచ్చిన అనుభవం అందుకోపోడానికి కారణం ఎవ్వరా అని ఆలోచిస్తూ కూర్చున్నాను. మా ముత్తాత కట్టిన "మహల్" కూలిపోయింది. అతను ఈ లోకంలో శాశ్వతంగా మిగిల్చినదేమైనా చేశాడా అన్న తలపు వచ్చి చుట్టూ చూశాను. అతను నాటిన కొబ్బరిచెట్టు కనిపించింది. అది మేఘాల్లోనికి చొచ్చుకున్నంత పొడుగ్గా ఉంది. ఒకప్పుడు కాయలు కాసేది. ఇప్పుడు పువ్వే పూయటం లేదు. ఎండిన కొమ్మలు ఏడాదికి ఒకటో, రెండో రాలుతాయేమో? ఇంకేమైనా ఉందా?

గుడి గంటలు వినిపించాయి. ఏటి ఒడ్డున ఉన్న శివాలయం గంటలు. ఆ శివాలయం కట్టడానికి కారణం ఒక శివభక్తురాలు. అదే బంటెమ్మ. మా ముత్తాత చేత ఆ పని చెయ్యించి తన యావదాస్తినీ ఆ కోవెలకు రాసి చచ్చిపోయిందట. అందుకే ఈనాటికీ ఆ కోవెలను బంటెమ్మ కోవెల అంటారు.

అలా కూర్చున్నాను. ఏటి మీది నుంచి వీచే గాలి పాత తలపులను గుర్తుకు తెస్తోంది. ఏది నిత్యం, సత్యం అనుకున్నానో, అది పాడైపోయింది. మా తాత వేసిన చింతచెట్టు మాత్రం పచ్చని ఆకులతో నిత్యం, సత్యం అన్నట్లు నవ్వుతున్నట్లుంది. మా తాతయ్య సుందరరామ్మూర్తి తరీఫీదులో పెరిగినవాడిని. అసలు మా తాతయ్య జీవితమే ఒక పచ్చని చెట్టు. పెద్ద తలపాగ - నల్లనివాడు. తల్లిని పోలినాడట. అదృష్టవంతుడట. ఆ తల్లిని తండ్రి నీరసంగా చూసి, అవమానించి, అదుపు దాటి సంచరించడంతో తల్లి భాగమ్మను తన ఇంటికి తెచ్చుకుని దేవతలా చచ్చేవరకు చూసుకున్నాడు. అతని భార్య కాంతమ్మ ఆ రోజుల్లో అందానికి అధిదేవత. ఆవిడను చూడ్డానికి వచ్చిన అడంగులు ఆవిడ ప్రతి అవయవం, కట్టుకున్న బట్ట, పెట్టుకున్న నగల గురించి అబ్బురపడేవారట. కొందరు వీధి బాగవతంలో సత్యభామలా ఉందనేవారట. అంటే, అందానికి ఈ రోజుల్లో అందాల సినీతారలతో సమానమన్నమాట. ఆమె ముక్కులోనూ, చెవుల్లోనూ పాలబంగారంతో చేసిన కమ్ములుండేవి. మా నాన్నను కన్నాక కాంతమ్మ చచ్చిపోయింది. ఎందరో పిల్లనిస్తామని ముందుకొస్తే, 'అది బ్రతికే ఉంది. ఇంట్లో తిరుగుతూనే ఉంది. నాకెందుకు మరో పెళ్ళం' అని పెళ్ళి చేసుకోలేదు. పెడతోవలో పడలేదు. కొడుకును స్వయంగా తినిపించి పెద్ద చేశాడు. తండ్రి కట్టించిన ఇంటికి రంగులు వేయించి కొత్త ఇల్లులా ఉంచేవాడు. నలుగురు లేదన్నవాళ్ళ కిచ్చాడు. గదిలో దేవతా విగ్రహాలను గోడలకు అమర్చి, నిత్యం మొక్కుకునేవాడు. ముఖంపై పెద్ద పట్టెనామాలు పెట్టుకుని, గొంతెత్తి రామదాసు కీర్తనలు పాడేవాడు. రాను రాను తన ప్రవర్తనతో లోకుల భక్తిప్రపత్తులను అందుకున్నాడు. ఇలా తాతయ్యతో నా చిన్ననాటి తలపులు పూర్తి కాకుండానే నాకోసమే వెతుక్కుంటూ వచ్చినట్లు సత్తెయ్యమ్మ వచ్చింది. ఈమె సొగసు గురించి గంగమ్మ చెప్పింది నిజమే. అరవై దగ్గర పడుతున్నా, ఒయ్యారంతో పరుగెత్తుతోంది. ఆ మాట తీపి, ధాటి తగ్గలేదు. నా పక్కనే నన్ను తగిలేటట్లు కూర్చుంది.

"ఏమిటి ఇలా అయిపోయావు?" అంది.

"ఎలాగైపోయాను?"

"ఆ నాటి రూపు, చూపు ఈనాటికీ నా మనసులో నిల్చిపోయింది" అంది నా కళ్ళలోనికి చూస్తూ.

"అవన్నీ ఎందుకులే! ఇప్పటి సంగతి మాటాడు" అన్నాను.

"చూడు ఆ గది - తాతయ్య నన్నెంత ముద్దుగా చూసి ఎత్తుకునేవారో! స్వయంగా చదువు చెప్పి, కాపు పిల్లను కరణం పిల్లగా మార్చాడు. ఎప్పుడూ ఈ ఇంటి మనిషినే అనుకునేదాన్ని. వయసొచ్చాక ఈ ఇంటి కోడల నౌతాననుకున్నాను. అంతకాలం నవ్వించినవాడివి, నన్ను కవ్వించినవాడివి అంత వేగిరం మారిపోతావని అనుకోలేదు. కోరి నోరు విడచి అడిగాను. ముఖం తిప్పేశావు. ఆస్తికంతా

వారసురాలిని. నా ఆస్తినంతా తీసుకో. నన్ను నీ పాదాల చెంత చేరనీ అన్నాను. కాదనేశావు. నా పెళ్ళి అయిపోయింది. అప్పటికీ నిన్ను కలుసుకొని – నీతో ఒక బిడ్డను కనాలని ఉంది, పెళ్ళయినా నేను కన్యనే అని కాలా వేలా పడినా కాదన్నావు. మళ్ళీ ఈనాటివరకూ నీకు నా ముఖం చూపించలేదు. ఎందుకిలా మారిపోయావో ఇప్పుడైనా చెప్తావని వచ్చాను. ఇప్పుడు చెప్పడంవలన ఈ రహస్యం మనిద్దరి మధ్యనే ఉంటుంది – చెప్పు" అని చెయ్యి పట్టుకుంది.

మెల్లగా చేతిని విదిలించుకున్నాను. నా వయసులో నేనెరిగిన ఏ ఆడదీ ఇంత అందంగా ఉండేది కాదు. అసలు ఎవరితోనూ సరిపోల్చలేని అందం సత్తెయ్యమ్మది. పోనీ, గుణగుణాలను శంకించడానికి అటువంటి పొరపాట్లేమీ చెయ్యనిది. ఆకాశం అంత విశాలంగా ఉండి, భూమాతలా పచ్చగా కనిపించేది. ఎప్పుడూ సత్తెయ్యమ్మను నిరాకరిస్తానని అనుకోలేదు. కానీ, నిరాకరించాను. దీనికి కారణం ఆమె తెలుసుకోకూడదు. తెలుసుకుంటే నాలాగే ఆమె చిత్తక్షోభను పొందుతుంది. అంచేత మౌనం దాల్చితే...

"మళ్ళీ కలుసుకోగలమో లేదో! చెప్పవా?" అని రెట్టించింది.

"ఇప్పుడు చెప్పి లాభం ఏమిటి? కోరిన కోరిక తీరిపోతే పాలపొంగులా వచ్చిన ఆ కోరికనే మరచిపోతాం. సత్తెయ్యమ్మా! నువ్వంటే నాకు చాలా గౌరవం. ఎన్నడూ నిన్ను తల్చుకుంటుంటాను. కారణం? ఆ కోరిక తీర్చుకోకపోవడమే కదా! అది తీరకపోవడమే కదా నన్ను ఇంకా గుర్తుంచుకుని మామ్మవైనా నన్ను వెతుక్కుని వచ్చావు. ఆనాటి మనిషిలా నా ప్రక్కన కూర్చున్నావు" అన్నాను.

"నీ కోరిక తీరకపోతేపోయే. నా కోరిక తీరిపోయింది" అంది సవాలు చేస్తున్నట్లు.

"ఎలా?"

"నీ రూపుతో కొడుకును కనాలని ఉండేది. నా కొడుకు అచ్చు నీ రూపుతోనే పుట్టాడు. నీలా నెమ్మదిగా మాటాడతాడు. కావాలనే వాడిని నీకు చూపించలేదు. అదెలాగ సాధ్యం అయిందనా? నిత్యం నీ రూపే నా మనసులో మెసలేది – అందుకే వాడు నీ కొడుకు."

"అంత మాట అనకు. నేను ఎప్పుడూ వాడి తండ్రిని కాలేను."

ఒకసారి నా కళ్ళలోనికి చూసింది. నిదానించి చూసింది. కళ్ళలో నీళ్ళ కారిపోతున్నాయి. లేచిపోతూ –

"ఈ ఒక్క ఆశ తీర్చుకోలేనిదాన్ని. ఎక్కడున్నా హాయిగా ఉండు" అని సత్తెయ్యమ్మ మెల్లగా కదిలిపోయింది.

నా కళ్ళలోనూ నీళ్లు తిరిగి పోయాయిగానీ బయటకు రాలకుండా చూసుకున్నాను. కాస్సేపు మౌనంగా తూర్పుగది – అదే చివరి గది వేపు చూశాను. మా నాన్న సత్యన్నారాయణ గది. చిన్నప్పటి నుంచీ మా నాన్న అంటే నాకు భయంతో పాటు భక్తి ఉండేది. నాకు తొలి పాఠాలు నేర్పింది ఆయనే. నీతి కథల నుంచి శ్లోకం పోకడ చెప్పింది తనే! లెక్కలు సరిగ్గా చెయ్యకపోతే చెవి నులిమి చెయ్యించిందీ తనే! పుట్టిన నాటి నుంచి తల్లి ప్రేమను నోచుకోలేనివాడని అతనంటే తరువాత రోజుల్లో జాలిపుట్టేది. తల నిండుగా జుత్తుతో, మంచి మీసకట్టుతో, మనిషి పుష్టిగా

ఉండేవాడు. మాటలూ పుష్టిగా వచ్చేవి. ఏది చెప్పినా, ఏం చేసినా ప్రయత్నలోపం ఉండేది కాదు. అతని చక్కని ముత్యాల్లాంటి దస్తూరీ ఎలాంటిదో, అతని ప్రవర్తన అలాంటిదే అనుకునేవాణ్ణి. ఊరంతా అతని నిజాయితీని గౌరవించేవారు. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరిన తరువాత ప్రతి వారం ఇంటికి వచ్చేవాడిని. ప్రతిసారీ ఇల్లు కొత్తగా కనిపించేది. సత్తెయ్యమ్మ రెట్టింపు అందంతో కనపడేది. ఇద్దరి వయసులూ చూపుల్తో ఇక సరిపెట్టుకోలేకున్నట్లు అలజడి చేస్తున్నాయి. నాలో ఆవేశం పెరిగిపోతోంది. అప్పటికి మా తాతయ్య బతికే ఉన్నాడు. నా పరిస్థితిని అర్థం చేసుకున్నాడేమో ఒకనాటి రాత్రి చుక్కలతో నిండిన ఆకాశం నెత్తి మీద గూడులా ఉన్నప్పుడు రహస్యాలు చీకట్లోనే చెప్పాలన్నట్లు వాకిట మంచం మీద కూర్చుని మా తాతయ్య ఒక విషయం చెప్పాడు. అది చెప్పేముందు ఉపన్యాసంలా లోకరీతిని గురించీ, దైవభక్తిని గురించీ చెప్పాడు.

"నీ మంచి పనులతో, మంచి నడవడికతో నివ్వు సమాజంలో గౌరవం సంపాదిస్తావు. ఆ కీర్తి ఒక గిన్నెలో మరగిన పాలు లాంటిది. ఒక్క అప్రతిష్ఠాకరమైన పని చేస్తే అది ఆ గిన్నెడు పాలలో ఒక విషబిందువుగా పరిణమిస్తుంది. మనం రహస్యంగా చేసే పనులన్నీ అసలు రహస్యాలే కావు. ఒక దురుద్దేశంతో చేసిన పనికి ఒక పల్చని గుడ్డ కప్పి ఉంటుంది. చిన్నగాలికే గుడ్డ ఎగిరిపోయి రహస్యం బట్టబయలైపోతుంది."

ఇంత చెప్పిన వాడు ఇంకేం చెప్తాడనో అలా మౌనంగా ఉన్నాను. తనకు అంత్యం సమీపిస్తుందనో లేక పరిస్థితులు అదుపు దాటి పోతున్నాయనో ఏమో ఎందుకో ఎన్నడూ నేను ఇలాంటి రహస్యం ఇతని నోట వింటానని అనుకోలేదు.

"ఒక్క చెయ్యరాని పని చేసి మీ నాన్న నా తరఫీదులో విషపు బొట్టు వేశాడు. నమ్మిన ఇంట్లో చెయ్యరాని పని చేశాడు. తప్పు అని తెలిసి మరీ చేస్తే ఆ తప్పిదాన్ని దేముడు కూడా క్షమించడు. కొడుకు చేసిన తప్పిదానికి పశ్చాత్తాపంగా నేను నా మనుమరాలు సత్తెయ్యమ్మను అప్పుడప్పుడు ఇంట్లో ఉంచుకుని చదువు నేర్పి నా మేధస్సును కొంత అప్పచెప్పాను. సత్తెయ్యమ్మ పుట్టినప్పుడు నివ్వు చిన్నవాడివి. నీకూ, సత్తెయ్యమ్మకి ఇది రహస్యం కానీ, ఊరంతటికీ బయటకు అనలేని నిజం. సత్తెయ్యమ్మ నీ చెల్లెలు!"

అనాటి నుంచి మా ఊరు వెళ్ళడం తగ్గించేశాను. పెళ్ళి చేసుకున్నాక కూడా అవసరమైతేనే వెళ్ళేవాడిని. సత్తెయ్యమ్మ నన్ను కలుసుకునే అవకాశం ఒక్కసారే ఇచ్చాను. కానీ, నా మనసులో మా తాతయ్య ఈ పెళ్ళి తప్పించడానికి ఇలా సృష్టించి చెప్పాడా అని, సత్తెయ్యమ్మ మీద మమకారంతో ఒకోసారి అనుకునేవాడిని. మళ్ళీ అబద్ధం ఆడని మనుషులెవరైనా నా జీవితంలో తారసపడ్డారంటే అతనే నా పరీక్షకు నిలుస్తాడు. ఇలా ఈనాటికీ నాలో కొట్లాడుతున్న సంశయాన్ని సత్తెయ్యమ్మ తీర్చేసింది. సత్తెయ్యమ్మలో నా నాన్న రక్తం ఉంది. కాబట్టే ఆమెకు పుట్టిన కొడుకు నా ఆకారాన్ని పొందాడు. సత్తెయ్యమ్మ ముమ్మాటికీ నా చెల్లెలే!

మళ్ళీ నా చూపు మూడో గది వేపు మరలింది. ఇంత తతంగం జరిగినా మా అమ్మ నాన్నకు విధేయురాలుగా ఎలా ఉంది? అతని మీద ఒక ఈగ వాలనిచ్చేది కాదు. చిన్ననాటి నుంచి తల్లి ప్రేమ ఎరుగని వ్యక్తి అని, తండ్రి చేసిన

దానాలతో ఆస్తి వెచ్చబెట్టేస్తే శ్రమపడి ఆర్జించి కుటుంబాన్ని లేవనెత్తుతున్నాడని ఏమో మా అమ్మ శాంతమ్మ పేరుకు తగ్గట్లు శాంతస్వభావంతో, భర్తకు ఆదరణతో, అనురాగంతో సగం బాధను మరచిపోయేటట్లు చేసేది.

ఎదురుగా పాడుపడిన మూడు గదులు, ఇందులో నివసించే మనుషులు, వాళ్ళు ఆడిన జీవిత నాటకాలు చూస్తుంటే ఆ గదులు పాడుపడినా, ఆ దిగువ మట్టి పాడుపడలేదు. మట్టిలో పుట్టిన మనిషి మట్టిలో చేరుకుంటాడుగానీ, మట్టి నిత్యం, సత్యం. ఈ కూలిన గోడల దిగువనున్న మట్టికి విలువ ఉంది. ఈ జాగాకు వారసుణ్ణి నేను. అమ్ముతానంటే కొనేవాళ్ళున్నారు. ఆ మధ్య గదిలో నిజాయితీ కిరీటాన్ని ధరించిన ఒక మహామహుడుండేవాడు. ఆ జాగాలో తెల్లారితే బతుకు కోసం అన్యాయాలు – అక్రమాలు చేసేవాళ్ళు నివసించడానికి వీల్లేదు అని అనుకున్న సమయంలో ఒకావిడ నా వేపే వస్తోంది. అంత దూరంలో ఉండగానే నీలమ్మ అని పోల్చుకున్నాను. మనిషి రూపులో ప్రత్యేకత లేదుగానీ, మనిషి గుణంలో ప్రత్యేకత ఉంది. మొగుడు సిమ్మయ్య భూసంబంధమైన తగువులో పెద్ద రైతును చావమోది చంపేశాడు. ప్రత్యక్ష సాక్ష్యం నీలమ్మే. అప్పటికి గర్భిణి. ఎందరు చెప్పినా కోర్టులో నిజాన్నే చెప్పింది. భర్తకు ఆమరణ కారాగారశిక్ష పడింది. కొడుకు పుట్టాడు. ఉన్న ఒక పాక అప్పుల కింద పోయింది. కన్నవారింట చేరి తలిదండ్రుల సేవ చేస్తూ కొడుకును పెద్ద చేసింది. మొగుడు శిక్ష అనుభవించి విడుదలయ్యాక ఈ ఊరు రాలేదు. ఎక్కడకు వెళ్ళిపోయాడో ఎవరికీ తెలియదు. ఇంకో పెళ్ళి చేసుకోకుండా తలిదండ్రులను పోషించడానికి పనిపాట్లు చేసుకుంటూ ఉంది. ఎదిగిన కొడుకు ఇప్పుడు సహాయం చేస్తున్నాడు.

నా ఎదురుగా నిల్చునే ఉంది.

"మీ అమ్మ, నాయనా బాగున్నారా?" అడిగాను.

"ఇద్దరూ ఒక నెలరోజుల్లోనే పోయారు బాబూ!"

"అయ్యో!"

"నా తోడబుట్టినోడు పట్నం పోయి రిక్షా లాక్కుంటూ అక్కడే ఒక జాతి తక్కువదాన్ని సేసుకున్నాడు. ముగ్గురు పిల్లలు. అయ్య బతికిన్నాళ్ళూ ఎక్కడున్నావని అడగలేదు. ఇద్దరూ ఇక లేరు అనగానే పారొచ్చినాడు. నా ఇల్లు నాకిచ్చీ అంటున్నాడు. ఊరు పెద్దలు ఆడి పక్కే మాటాడుతున్నారు. అది పెద్దల ఆస్తి, మనుమడికే చెందుతుందంటున్నారు. ఇల్లు వదుల్తావా – ఇంటి నించి ఊడ్చేసేదా అని బెదిరిస్తున్నాడు. ఇన్నేళ్ళూ మెసలిన ఇల్లు వదిలి ఎక్కడికి ఎలిపోతాను? ఎక్కడో ఒక పాకేసుకుందామనుకుంటే ఊర్లో ఏ మూల ఇంత ఖాళీ జాగా లేదు. ఏ చెట్టు మీదో తల్లీకొడుకులం పచ్చుల్లాగ ఉండవలసిందే..." చప్పున వెనుకకు తిరిగి –

"అయ్యో! నా మతిమండ. దేనికొచ్చి ఏ మాటలు బాబుతో సెప్పుకున్నాను. అసిరి నాయనా! ఇలా రారా" అని కొడుకును పిల్చింది. వాడు నెత్తిమీద మోసుకొచ్చినవి కిందకు దించాడు. అవి చూపిస్తూ –

"బాబో! తమరు ఊర్లో లేరు. గాలివానొచ్చింది. ఈ మారాజులున్న ఇల్లు సగం కూలిపోయింది. అయినా, పూర్తిగా ఈ ఊరి ప్రజ కూల్చేసి ఎవరికి చిక్కిన

కలప వాళ్ళు తీసుకపోనారు. అలంతా సేస్తంటే నేనెందుకు సెయ్యకూడదని నా కొడుకూ ఈ మూడు బల్లలు తెచ్చేసినాడు. ఎప్పుడైనా తమరు రారా – వస్తే మీ వస్తువులు మీకు అప్పజెప్తామని జాగ్రత్తగా ఉంచినాను. తీసుకోండి బాబూ!" అంది. కొద్ది క్షణాలు నాకు మాట రాలేదు. ఆ మూడు గదుల గుమ్మాల మీద నగిషీలు చిందిన బల్లలవి. అవి చూడగానే నా ముత్తాత, తాత, తండ్రులను ప్రత్యక్షంగా చూసినట్లయింది. చప్పున కన్నీళ్ళు తిరిగిపోయాయి. కళ్ళు తుడుచుకుంటూ 'ఈ మూడు బల్లలు పట్నంలో నా మూడు గదుల్లో పెట్టుకుని, నేనే కాదు నా తరతరాలవారు, మా ముందుతరాల వారిని తల్చుకునేటట్లు ఉంచుతాను' అనుకున్నాను.

"నేను చేసిన పని తప్పా బాబూ? మీ కళ్ళలో నీరు తెప్పించాను" అంది నీలమ్మ.

మా తాతయ్య సుందరరామ్మూర్తి ఒకసారి చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది: "మనిషి ఇచ్చి పెరుగుతాడు. పుచ్చుకుని పతనమౌతాడు."

నేను మనిషిగా పెరిగే అవకాశం ఇప్పుడు దొరికింది.

"నీలమ్మా! ఒక మాట చెప్పేదా?"

"చెప్పు బాబూ!"

"నీకెక్కడా ఇల్లు కట్టుకోడానికి జాగాలేదు కదా?"

"లేదు బాబూ!"

"ఈ జాగా నాది. ఇక్కడ పాకేసుకుంటావా?"

"బాబూ! ఈ మారాజుల జాగాలో నాలాంటి..."

"ఆ మారాజులకు ఎందులోనూ తీసిపోవు. ఆ మారాజులకన్నా గొప్పదానవు" అంటూ లేచి –

"ఇదిగో, ఈ మధ్యగది గోడలెత్తి పాక వేసుకుని అందులో ఉండు. నీకు రాసి ఇచ్చేస్తాను. ఇంద, ఈ డబ్బు పెట్టి పాక వేసుకో" అని డబ్బు అందిస్తే ఆమె చేతులు వణికిపోయాయి. అందుకోలేకపోయింది. కొడుకు అందుకున్నాడు.

నన్ను పెంచి, పెద్ద చేసి, నేను మనిషిగా రాణించడానికి అన్నివిధాలా ముడిసరకును, ఆలోచనలను అందిచ్చిన ఈ మూడు గదుల రంగస్థలాన్ని మానవతా విలువలను పరిరక్షిస్తున్న ఒక ఉత్తమురాలికి అప్పచెప్పానన్న తృప్తితో తిరుగుప్రయాణమయ్యాను.

(ఇండియా టుడే – 9 జూలై, 1997)

* * *